కండ్లలో కారం పోసి..పారతో ఒంటిపై చెక్కి!

- నకిరేకల్‌లో యువకుడి దారుణ హత్య
- ప్రాణం తీసిన వివాహేతర సంబంధం
- డీఎస్పీ కార్యాలయంలో నిందితులు?

నకిరేకల్, జూన్ 21: ఓ యువకుడి కళ్లల్లో కారం కొట్టి.. గడ్డి చెక్కే పారతో శరీరంలోని అన్ని భాగాలను చెక్కి, మర్మాంగాలను మెలేసి, శరీరంపై పిడిగుద్దులు గుద్ది అనంతరం చెట్టుకు కట్టేసి కాళ్లు విరగ్గొట్టి హతమార్చిన దారుణ ఘటన నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం నోములలో చోటుచేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింగ్ జానయ్య(34) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ తన తల్లితో నోముల గ్రామంలో జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ధనమ్మ అనే వివాహితతో జానయ్యకు 8 సంవత్సరాలుగా వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయమై ఇరుకుటుంబాల మధ్య పలుమార్లు గొడవలు జరిగి పోలీస్ స్టేషన్ వరకూ పంచాయితీ వెళ్లింది. గత సంవత్సరం అక్టోబర్‌లో ధనమ్మ, నాగరాజు దంపతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో జానయ్య అరెస్టయి జైలుకి వెళ్లి వచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం జానయ్య.. ధనమ్మ ఇంటికి వెళ్లగా వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ధనమ్మ కూతురు తండ్రికి ఫోన్ చేయడంతో నాగరాజు ఆవేశంతో ఇంటికి వచ్చాడు. నాగరాజు, ధనమ్మతో పాటు కూతురు, ధనమ్మ తల్లి కలిసి జానయ్యను వారి ఇంట్లోనే విచక్షణా రహితంగా కొట్టారు. మర్మాంగాలను మెలిపెట్టి, ఛాతిపై పిడిగుద్దులు గుద్ది, పారతో శరీర భాగాలను చెక్కి వారి ఇంటి ముందున్న చెట్టుకు కట్టేసి, కళ్లల్లో కారంకొట్టారు. మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకూ జానయ్యను విచక్షణా రహితంగా కొట్టడంతో అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. జానయ్య బంధువులు వచ్చి అంబులెన్స్‌లో నకిరేకల్ దవాఖానకు తరలించగా పరిస్థితి విషమంగా ఉందని, నల్లగొండ దవాఖానకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో జానయ్యను నల్లగొండ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ రాత్రి 7.40 గంటలకు మృతిచెందాడు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ధనమ్మ, నాగరాజు నకిరేకల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి తామే జానయ్య కొట్టామని చెప్పి పోలీసులకు లొంగిపోయారు. శనివారం నల్లగొండ డీఎస్పీ కార్యాలయంలో ధనమ్మ, నాగరాజు సరెండర్ అయినట్టు సమాచారం. జానయ్య తల్లి నర్సింగ్ ప్రమీల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రాజశేఖర్ తెలిపారు. ప్లాట్ల బేరం చేసి తన కొడుకు సంపాదించిన డబ్బు మొత్తం ధనమ్మ వాడుకుందని, ఎనిమిదేళ్ల పాటు ఆగం చేసి, ఇప్పుడు దారుణంగా కొట్టి చంపారని, తనకు దిక్కెవరంటూ తల్లి ప్రమీల గుండెలు బాదుకుంటూ రోదించింది. తన కొడుకును చంపినవారిని కఠినంగా శిక్షించి, తనకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకుంది.

నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం నోములలో చెట్టుకు కట్టేసి ఉన్న నర్సింగ్ జానయ్య ఇన్‌సెట్‌లో నర్సింగ్ జానయ్య(ఫైల్)

పోలీసులు చలనం లేకుండా చేసిన్రు!

- అక్రమ కేసులో ఇరికించి కొట్టిన్రు
- కోమాలోకిపోయిన రాజ్‌కుమార్
- గుండెలవిసేలా రోదించిన తలిదండ్రులు
- న్యాయం చేయాలని మంథనిలో ధర్నా

పెద్దపల్లి జిలా మంథని అంబేద్కర్ చౌరస్తాలో బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

మంథని, జూన్ 21: పోలీస్ కేసు.. వారి దెబ్బలకు భయపడి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నంచేసి అచేతనస్థితిలోకి వెళ్లిపోవడంతో అతడి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. తమ కొడుకుకు ఇలాంటి దుస్థితి తెచ్చిన వారిపై చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అచేతనస్థితిలో ఉన్న యువకుడిని అంబులెన్స్‌లోనే ఉంచి అతడి తల్లిదండ్రులు, స్థానికులు శనివారం పెద్దపల్లి జిల్లా మంథని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేశారు. బాధితుడి తల్లిదండ్రులు చీరం రాజేశ్వరి-దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గత వానకాలం సీజన్‌లో శ్రీపాద కాలనీలోని కొనుగోలు కేంద్రం వద్ద హమాలీ కార్మికులతో గొడవ పాల్పడుతున్నాడంటూ కొంతమంది తమ కొడుకు రాజ్‌కుమార్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఎస్ఐ, కానిస్టేబుళ్లు తమ కొడుకును పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి తీవ్రంగా కొట్టి, అకారణంగా కేసు నమోదు చేయడంతో మనస్తాపానికి గురై ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించగా కరీంనగర్, హైదరాబాద్ దవాఖానలకు తీసుకెళ్లామని చెప్పారు. కోమాలో ఉంటూ అచేతన స్థితిలో మంచానికే పరిమితయ్యాడని వాపోయారు. చేతికందొచ్చిన కొడుకును మంచానికి పరిమితం చేసిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా పట్టించుకోవడం లేదని చెప్పారు. దీంతో తమ కొడుకును అంబులెన్స్‌లో తీసుకొచ్చి న్యాయం జరగాలని కోరుతూ ధర్నాకు దిగినట్టు వెల్లడించారు. ఎస్ఐ, కానిస్టేబుళ్లు, మాజీ కౌన్సిలర్, హమాలీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. సీఐ రాజు, కాంగ్రెస్ నాయకులు చేరుకొని న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

ఆర్టీసీ పరిరక్షణకు పోరాటం తప్పదు

రోడ్డు రవాణా కార్మికుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య

ఖమ్మం కమాన్‌బజార్, జూన్ 21 : ఆర్టీసీ పరిరక్షణ, కార్మిక చట్టాల రక్షణ కోసం సిద్ధం కావాలని అఖిల భారత రోడ్డు రవాణా కార్మికుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య పిలుపునిచ్చారు. ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర 4వ మహాసభలు శనివారం ఖమ్మం ఐఎంఏ హాల్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని ఆర్టీసీ సంస్థలకు సమాధి కట్టేలా 2019 మోటార్ వాహన చట్టం సవరణకు కేంద్రం పూనుకోవడం దారుణమన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ప్రైవేట్ ఆపరేటర్లు, అగ్రిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ పాలసీ పేరుతో ఊబర్, ఓలాతో పాటు బహుళజాతి రవాణా సంస్థలు భారత రవాణా రంగంలోకి చొరబడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు కార్మిక, కర్షక మైత్రితో సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గాలు పాల్గొనాలని కోరారు.

తెలంగాణలో జై ఆంధ్రప్రదేశా?

- చంద్రబాబు యోగాంధ్ర ప్రసంగ ప్రచారంపై ఆగ్రహం
- వరంగల్‌లో 'రాజముద్ర' సాక్షిగా తెలంగాణకు అపకీర్తి



వరంగల్ జిల్లా ఖిలా వరంగల్‌లో స్క్రీన్‌పై లైవ్ టెలికాస్ట్ అవుతున్న చంద్రబాబు ప్రసంగం

ఖిలా వరంగల్, జూన్ 21 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ అగ్గిమీద గుగ్గిలం అవుతుంటే.. పుండుమీద కారం చల్లినట్టు ఏపీ సీఎం చంద్రబాబు ప్రసంగం తెలంగాణ రాజముద్ర(కాకతీయ కళాతోరణం)నే కలవరానికి గురిచేసింది. అంతర్జాతీయ యోగా దినోత్సవం శనివారం విశాఖపట్నంలో నిర్వహించగా ప్రధాని నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా భారీ ఎల్ ఈడీ స్క్రీన్లు పెట్టి ప్రదర్శించారు. మిగతా రాష్ట్రాల్లో కేవలం ప్రధాని ప్రసంగాన్ని లైవ్ టెలికాస్ట్ చేసి, తెలంగాణలో మాత్రం ప్రధానితో పాటు చంద్రబాబు ప్రసంగాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్ల ద్వారా ప్రసారం చేయడం వెనుక ఆంతర్యం ఏమిటన్న వాదన వినిపిస్తున్నది. వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ ఏకశిలా కీర్తితోరణాల మధ్య యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌ఈడీ స్క్రీన్లో ఉదయం 6.38 గంటల నుంచి 7 నిమిషాల పాటు చంద్రబాబు ప్రసంగిస్తూ.. 'రికార్డులను సృష్టించేది.. రికార్డులను బ్రేక్ చేసేది ప్రధాని నరేంద్రమోదీ, వికసిత్ భారత్‌లో భాగంగా 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధిస్తుంది.. తెలుగుజాతి గర్వపడేలా ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం. యోగాంధ్ర కార్యక్రమం ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది. ప్రధాని మోదీ ప్రారంభించిన ఈ ఉద్యమాన్ని జీవన విధానంగా మార్చుకొని తెలుగుజాతి ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలి, జై భారత్.. జై ఆంధ్రప్రదేశ్' అని పేర్కొన్నారు. ఈ ప్రసంగంపై తెలంగాణ వ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతున్నది. రాష్ట్ర రాజముద్ర సాక్షిగా తెలంగాణ ఆత్మగౌరవానికి భంగం వాటిల్లిందని, అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రగతి ప్రస్థానం, చంద్రబాబు గొప్పతనం తమకెందుకని యోగా శిబిరంలో పాల్గొన్నవారు ప్రశ్నిస్తున్నారు. కాకతీయ కీర్తితోరణాల సాక్షిగా చంద్రబాబు ప్రసంగాన్ని ప్రచారం చేసి తెలంగాణకు అపకీర్తిని ఆపాదించారని వరంగల్ 38వ డివిజన్ కార్పొరేటర్ బైరబోయిన ఉమ పేర్కొన్నారు. ఏకశిలా తోరణాల మధ్య యోగాంధ్రప్రదేశ్, స్వర్ణాంధ్రప్రదేశ్, జై ఆంధ్రప్రదేశ్ వంటి నినాదాలు చేయడం దారుణమని మండిపడ్డారు.

యోగాంధ్ర అభాసుపాలు

మ్యాట్లు, ఆహార ప్యాకెట్ల చోరీ • సోషల్ మీడియాలో వీడియో వైరల్

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): విశాఖలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమం అభాసుపాలైంది. మ్యాట్లు, ఆహార ప్యాకెట్ల సంచులను కొందరు ఎత్తుకెళ్లారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రధాని మోదీ వస్తున్నాడని గిరిజన ప్రాంతాల నుంచి విద్యార్థులను తరలించి వారికి వసతులు కల్పించకపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. కనీసం కప్పుకోవడానికి బెడ్ షీట్లు కూడా ఇవ్వకపోవడంతో నేలపైనే విద్యార్థులు పడుకున్నారు. కొంత మంది మహిళలు వసతులు సరిగా లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 3 గంటలకు తీసుకొచ్చారని తిండి లేదని తిరిగి వెళ్లడానికి కూడా బస్సులు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 175 దేశాల్లో యోగా సాధన చేయడం సాధారణ విషయం కాదన్నారు. యోగా మానవతను పెంచే ప్రక్రియ అని స్పష్టం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. దాదాపు 3.3 లక్షల మంది వచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమానికి తొలిసారి రెండు గిన్నిస్ బుక్ రికార్డులు దక్కినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాలోకేశ్ పాల్గొన్నారు.



రైల్వే రన్నింగ్‌రూం ప్రారంభోత్సవంలో రైల్వే జీఎం అరుణ్‌కుమార్, డీఆర్ఎం బీకే జైన్

డిసెంబర్‌లో 'కాజీపేట రైల్వేకోచ్'

- దక్షిణ మధ్య రైల్వే జోన్ జీఎం అరుణ్

కాజీపేట, జూన్ 21: కాజీపేట రైల్వే జంక్షన్ శివారు అయోధ్యపురంలో నిర్మిస్తున్న రైల్వే కోచ్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ వచ్చే డిసెంబర్‌లో ప్రారంభమవుతుందని దక్షిణ మధ్య రైల్వేజోన్ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ పేర్కొన్నారు. శనివారం ఆయన కాజీపేట రైల్వేజంక్షన్ పరిసరాల్లో నిర్మించిన రన్నింగ్ రూమ్‌ను సికింద్రాబాద్ రైల్వే డీఆర్ఎం భర్తేశ్‌కుమార్‌జైన్‌తో కలిసి ప్రారంభించారు. సికింద్రాబాద్ నుంచి రైల్వే ఉన్నతాధికారులతో కలిసి ప్రత్యేక రైలులో తనిఖీలు చేసుకుంటూ కాజీపేట రైల్వే జంక్షన్‌కు చేరుకున్నారు. ఆర్ఆర్ఐ క్యాబిన్, క్రూల్యాబీ, పవర్ కంట్రోల్‌రూం, అమృత్ భారత్ పథకం పనులను తనిఖీచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లోకో రన్నింగ్ స్టాఫ్ కార్మికుల కోసం రన్నింగ్ రూమ్ నిర్మించినట్టు తెలిపారు. రైల్వే కోచ్ పనులు చివరి దశకు చేరుకున్నాయని, భవిష్యత్‌లో వందేభారత్ కోచ్‌లు తయారవడం ఖాయమని చెప్పారు.

అగ్రి కార్పొరేషన్లలో ఇష్టారీతిన ప్రమోషన్లు!

హైదరాబాద్, జూన్ 21(నమస్తే తెలంగాణ): వ్యవసాయ అనుబంధ కార్పొరేషన్లలో ఉద్యోగులకు ఇష్టారీతిన ప్రమోషన్లు కల్పించడంపై వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకుండా డీపీసీల ఏర్పాటు, ప్రమోషన్లు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్పొరేషన్లలో ఇష్టారీతిన ప్రమోషన్లకు అడ్డుకట్ట వేసేందుకు శనివారం కీలక ఆదేశాలు జారీచేశారు. ఏ కార్పొరేషన్ కూడా ప్రభుత్వ అనుమతి లేకుండా ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వొద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రమోషన్ల కమిటీలో కార్పొరేషన్ అధికారులే కాకుండా వ్యవసాయ శాఖ అడిషనల్ సెక్రటరీ లేదా జాయింట్ సెక్రటరీలో ఎవరో ఒకరు సభ్యుడిగా ఉండాలని నిబంధన విధించారు. కార్పొరేషన్లన్నీ ఇక నుంచి ఈ నిబంధనలు పాటించాలని ఆదేశించారు.

సింగరేణి తొలి పంప్డ్‌స్టోరేజీ పవర్‌ప్లాంట్

రామగుండంలో ఏర్పాటు చేస్తున్న సంస్థ

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ) : వ్యాపార విస్తరణలో భాగంగా పెద్ద ఎత్తున విద్యుత్తు ప్లాంట్లను నెలకొల్పుతున్న సింగరేణి సంస్థ తాజాగా రాష్ట్రంలోనే తొలి పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. రామగుండం - 1 ఏరియాలోని మేడిపల్లి ఓపెన్‌కాస్ట్‌లో తొలి పంప్డ్ స్టోరేజీ ప్లాంట్‌ను నెలకొల్పనున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ శనివారం ప్రకటించారు. ఇప్పటికే ప్రాథమిక అధ్యయనం పూర్తైందని, డీపీఆర్ రూపొందించే బాధ్యతలను వ్యాప్కోస్ లిమిటెడ్ సంస్థకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. జియోలాజికల్, జియో టెక్నికల్, హైడ్రాలజీ అధ్యయనాలు, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ డిజైన్లు, పర్యావరణ సంబంధ అంశాలు రక్షణ చర్యలపై అధ్యయనం జరిపి డీపీఆర్‌ను రూపొందిస్తామన్నారు. మేడిపల్లి ఓపెన్‌కాస్టు మూసివేయగా, ఈ ప్లాంట్ ఏర్పాటుతో తిరిగి వినియోగంలోకి తీసుకురాన్నట్లు సీఎండీ వెల్లడించారు. రూ.3 వేల కోట్లతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుండగా, 40 ఏండ్ల పాటు 500 మెగావాట్ల విద్యుత్తును ఈ ప్లాంట్ నుంచి ఉత్పత్తి చేస్తామన్నారు.

ఉత్పత్తి ఇలా..

పంప్డ్‌స్టోరేజీ అనేది ఒక రకంగా జల విద్యుత్తు ప్లాంటే. అయితే జల విద్యుత్తు కేంద్రాల్లో నీటి ప్రవాహం సహజంగా ఉంటుంది. కానీ పంప్డ్ స్టోరేజీని నీటిని కింది నుంచి పైకి పంపింగ్ చేసి, కిందికి వదిలి విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు. అంటే సంపులో నీటిని నిల్వ చేయడం, పైకి పంపింగ్ చేయడం, తిరిగి కిందికి వదలడంతో దానిద్వారా విద్యుత్తు ఉత్పత్తి కానున్నది. ప్రతిపాదిత మేడిపల్లి ఓసీని నీటి సంపుగా మార్చి, 157 మీటర్ల లోపులో నీటిని నిల్వచేస్తారు. ఈ నీటిని తోడి ఎత్తైన ప్రదేశానికి పంపింగ్ చేస్తారు. పై భాగంలో టర్బైన్లు, జనరేటర్లతో కూడిన విద్యుత్తు తయారీ ప్లాంట్‌ను నెలకొల్పుతారు. పైకి పంపింగ్ చేసిన నీటిని అక్కడి నుంచి తిరిగి కిందికి వదులుతారు. ఈ నీటి ద్వారా టర్బైన్లను తిప్పి విద్యుత్తు ఉత్పత్తి చేస్తారు.

ఎల్ ఐసీ హెచ్ఎఫ్ఎల్ వడ్డీరేట్ల తగ్గింపు

న్యూఢిల్లీ, జూన్ 21: దేశంలో అతిపెద్ద హౌజింగ్ ఫైనాన్స్ ఎల్ఐసీ హౌజింగ్ ఫైనాన్స్ మరోసారి వడ్డీరేట్లను తగ్గించింది. నూతనంగా గృహ రుణాలు తీసుకునేవారికి వడ్డీరేటును అర శాతం కోత పెట్టింది. దీంతో 7.50 శాతం వార్షిక వడ్డీరేటుతో గృహ రుణాలు ప్రారంభంకానున్నాయి. తగ్గించిన వడ్డీరేట్లు ఈ నెల 19 నుంచి అమలులోకి వచ్చాయని పేర్కొంది. రిజర్వుబ్యాంక్ ఇటీవల కీలక వడ్డీరేట్లను అర శాతం తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు కంపెనీ ఎండీ, సీఈవో త్రిభువన్ అధికారి తెలిపారు.

పన్ను వసూళ్లలో క్షీణత

ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.4.59 లక్షల కోట్లు మాత్రమే

న్యూఢిల్లీ, జూన్ 21: పన్ను వసూళ్లు తగ్గుముఖం పట్టాయి. దేశ ఆర్థిక వ్యవస్థ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.4.59 లక్ష కోట్ల నికర ప్రత్యక్ష పన్ను వసూలయ్యాయి. క్రితం ఏడాది ఇదే సమయంలో వసూలైన రూ.4.65 లక్షల కోట్లతో పోలిస్తే 1.39 శాతం తగ్గాయని పేర్కొంది. అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు మందగించడం, అధికంగా రిఫండ్లు చెల్లింపులు జరపడం వల్లనే తగ్గాయని కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఏప్రిల్ 1 నుంచి జూన్ 19 మధ్యకాలంలో కార్పొరేట్ల లాభదాయకత, వ్యక్తుల ఆదాయం కేవలం 3.87 శాతం పెరిగి రూ.1.56 లక్షల కోట్లకు చేరుకున్నాయి. గతేడాది ఇదే సమయంలో అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు 27 శాతం అధికమయ్యాయి. అలాగే కార్పొరేట్ల అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు ఏడాది ప్రాతిపదికన 5.86 శాతం అధికమై రూ.1.22 లక్షల కోట్లకు చేరుకోగా..కార్పొరేటేతర్లు, వ్యక్తిగత, హెచ్‌యూఎఫ్, సంస్థల ట్యాక్స్ వసూళ్లు 2.68 శాతం తగ్గి రూ.33,928 కోట్లకు పరిమితమయ్యాయి.

- రిఫండ్ చెల్లింపులు ఏడాది ప్రాతిపదికన 58 శాతం ఎగబాకి రూ.86,385 కోట్లకు చేరుకున్నాయి.
- స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.5.45 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. క్రితం ఏడాదితో పోలిస్తే 4.86 శాతం అధికమయ్యాయి.
- ఏప్రిల్ 1 నుంచి జూన్ 19 వరకు నికర కార్పొరేట్ పన్ను వసూళ్లు ఏడాది ప్రాతిపదికన 5 శాతం తగ్గి రూ.1.73 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి.

వాణిజ్య

సిఫారసు ఉంటేనే పరిశ్రమకు సై

నిలిచిపోయిన దరఖాస్తుల పరిశీలన

కుప్పలు తెప్పలుగా పేరుకుపోయిన వైనం

పడకేసిన టీజీఐఐసీ..అయోమయ స్థితిలో పారిశ్రామికవేత్తలు

బీఆర్ఎస్ హయాంలో 25 వేల వరకు అనుమతుల మంజూరు

గతంలో సజావుగా సాగిన ఆన్‌లైన్, సింగిల్ విండో విధానం

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పారిశ్రామిక రంగం కునారిల్లుతున్నది. పరిశ్రమల స్థాపన కోసం ఔత్సాహికులు నుంచి వస్తున్న దరఖాస్తులకు దిక్కూ మొక్కూ లేకుండా పోయింది. అనేక నెలలుగా దరఖాస్తులను పరిశీలించే నాథుడే లేకపోవడంతో అవి కుప్పలుతెప్పలుగా పేరుకుపోయాయి. రాష్ట్రంలో ఏదైనా పరిశ్రమ ఏర్పాటు చేయాలంటే ముందుగా అనుమతుల కోసం టీజీఐఐసీకి దరఖాస్తు చేసుకోవాలి. ఆ పత్రాలన్నీ సవ్యంగా ఉంటే అనుమతులు మంజూరు చేసి, దరఖాస్తుదారులు కోరుకున్న పారిశ్రామికవాడలో నిర్ణీత ధరకు భూమిని కేటాయిస్తారు. ఇదే క్రమంలో ఎంతో మంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ కరుణించేవాడు లేకుండా పోయింది కాంగ్రెస్ సర్కార్ పరిపాలనలో. ఉదాహరణకు నల్గొండకు చెందిన ఓ ఔత్సాహిక పారిశ్రామిక వేత్త దండు మల్కాపూర్‌లో ఎంఎస్ఎంఈ యూనిట్ ఏర్పాటుకు గతేడాది ఫిబ్రవరిలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, ఇంతవరకు అతని దరఖాస్తు పరిశీలించిన పాపనపోలేదు. అదే ప్రాంతంలో యూనిట్ ఏర్పాటునకు సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరిలో దరఖాస్తు చేసుకున్న వేరొకరికి మాత్రం వెంటనే అనుమతులు మంజూరయ్యాయి. కరీంనగర్ జిల్లాలో పరిశ్రమ ఏర్పాటుకు గత ఏడాది ఆగస్టులో దరఖాస్తు చేసుకున్న ఓ వ్యక్తికి ఇంతవరకు అనుమతులు మంజూరు కాలేదు. దరఖాస్తులో కానీ, అర్హతల్లో కానీ ఎటువంటి లోపాలు లేవు. అయినా ఆయన దరఖాస్తును పరిశీలించిన నాథుడే లేడు. ఇవి మచ్చుకకి ఒకటి రెండు మాత్రమే. టీజీఐఐసీలో ఇటువంటివి తవ్వుతున్నా కొద్ది బయట పడుతున్నాయి. అనుమతుల కోసం దరఖాస్తు చేసేవారు మంత్రిదో, లేక స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధిదో సిఫారసు తీసుకొని వెళ్తే తప్పా అనుమతులు మంజూరయ్యే పరిస్థితి లేదు. పరిశ్రమకు అనుమతి కోరుతూ ఆన్‌లైన్ ద్వారా నిత్యం పదుల సంఖ్యలో టీజీఐఐసీకి దరఖాస్తులు వస్తాయి. వాటిని ప్రతివారం అధికారులు పరిశీలించి అందులో అన్నీ సవ్యంగా ఉన్నవాటికి అనుమతులు మంజూరు చేస్తారు. గతంలో ప్రతి వారం 50 నుంచి 60 వరకు అనుమతులు మంజూరయ్యేవి. టీఎస్ఐపాస్ చట్టం ద్వారా 2015 నుంచి 2023 వరకు సుమారు 24,241 అనుమతులు మంజూరుచేశారు. ఇందులో తయారీ రంగంలో 21,921 యూనిట్లు కాగా, మిగిలినవి సేవల రంగానికి సంబంధించినవి. దరఖాస్తు చేసుకున్నవారికి టీజీఐఐసీ అధికారులు మెసేజ్ ద్వారా వెంటనే దరఖాస్తు పురోగతి వివరాలు, ఇంటర్వ్యూల వివరాలు అందించేవారు. అనుమతులు సైతం ఆన్‌లైన్ ద్వారా పొందే వెసులుబాటు కల్పించారు. కానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఈ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. ఆన్‌లైన్ ద్వారా వస్తున్న దరఖాస్తులను పరిశీలించే నాథుడే కరువయ్యాడు. టీజీఐఐసీ అధికారులు మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేల సిఫారసులు ఉన్నవాటిని మాత్రమే ప్రాసెస్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ప్రస్తుతం 2 వేలకు పైగా దరఖాస్తులు పేరుకుపోయినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ ఏడాదిన్నరలో మంజూరైన అనుమతులు కేవలం 190 మాత్రమే కావడం గమనార్హం. దీన్నిబట్టి పరిస్థితి ఏ విధంగా ఉందో ఊహించుకోవచ్చు.

చక్రం తిప్పుతున్న కాంగ్రెస్ నేతలు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో కొందరికి అనుమతులు మంజూరు చేసినప్పటికీ స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు అభ్యంతరం చెప్పడంతో వాటిని నిలిపివేశారని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఉదాహరణకు కీసర ప్రాంతంలోని ఓ పారిశ్రామికవాడలో ఒకరికి పరిశ్రమ ఏర్పాటుకు అనుమతించి భూమి కేటాయించగా, సదరు వ్యక్తి భూమి చదును చేసుకునేందుకు వెళ్లగా స్థానికంగా ఉండే ఓ కాంగ్రెస్ నేత పనులు నిలిపివేసినట్లు తెలిపారు. సంగారెడ్డి, నల్గొండ, కరీంనగర్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, యాదాద్రి-భువనగిరి తదితర జిల్లాల్లో మంత్రులు, స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల అనుమతి లేకుండా ఒక్క అనుమతి కూడా మంజూరు కావడంలేదని చెబుతున్నారు. ముఖ్యంగా బండ తిమ్మాపూర్, బండ మైలారం, పాశమైలారం, సుల్తాన్‌పూర్, ఇబ్రహీంపట్నం, భువనగిరి తదితర ప్రాంతాల్లోని ఇండస్ట్రియల్ పార్కుల్లో అనుమతులకు డిమాండ్ అధికంగా ఉందని, అయినా రాజకీయ జోక్యం కారణంగా తాము అర్హతలకు అనుగుణంగా అనుమతులు మంజూరు చేసే అవకాశం లేదని అధికారవర్గాలు వాపోతున్నాయి. అందుకే మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి ఫోన్లు చేయించుకున్న వారికి మాత్రమే అనుమతులు ఇస్తున్నట్లు ఓ అధికారి వ్యాఖ్యానించారు.

ఫ్యూచర్ సిటీవైపు..

గత బీఆర్ఎస్ సర్కారు పరిశ్రమల కోసం ప్రభుత్వ భూములు సహా దాదాపు 1.50 లక్షల ఎకరాల ల్యాండ్‌బ్యాంక్‌ను సిద్ధం చేసింది. అంతేకాదు, దాదాపు 156 వరకు ఇండస్ట్రియల్ పార్క్‌లను ఏర్పాటుచేసి దాదాపు 28 వేల ఎకరాలకు పైగా భూములను పరిశ్రమలకోసం కేటాయించింది. ఇంకా చాలా పార్క్‌లలో మౌలిక సదుపాయాలు కల్పించి పరిశ్రమలకు కేటాయించాల్సి ఉంది. కాగా, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు ఆ భూములను అభివృద్ధి చేసి పరిశ్రమలకు కేటాయించాల్సిందిపోయి ఫ్యూచర్ సిటీ వెంట పరుగులు తీస్తున్నది. దరఖాస్తులు కుప్పతెప్పలుగా పేరుకుపోయినా పట్టించుకోక